చిన్న తండా.. సమస్యలే నిండా

- తండాకు పది కిలోమీటర్ల దూరంలో జెర్రిపోతులగూడెం గ్రామ పంచాయతీ
- పెన్షన్, రేషన్ బియ్యానికి ప్రతినెలా అక్కడికే ప్రయాణం
- చదువు, వైద్యానికి తప్పని తిప్పలు
- సీతారాంతండాను బేతవోలు జీపీలో కలపాలని గ్రామస్తుల వేడుకోలు


చిలుకూరు మండలంలోని సీతారాంతండా

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం ఆవాస గ్రామమైన సీతారాంతండాలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిలుకూరు మండలంలో చివరి గ్రామం, అతి చిన్న గ్రామం ఇది. అయితే ఏదైనా పని నిమిత్తం ఆ తండావాసులు జెర్రిపోతులగూడెం గ్రామ పంచాయతీకి వెళ్లాలంటే చుట్టూ తిరిగి 10 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందని అంటున్నారు. రెండు ప్రధాన జాతీయ రహదారిని కలిపే డబుల్ రోడ్డు పక్కనే తమ గ్రామం ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబుల్ రోడ్డు వెంటే ఉన్నా..

కాగా, హుజూర్‌నగర్ మండల పరిధిలోని రాయినిగూడెం వద్ద కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారి నుంచి ఆ గ్రామం మీదుగా చిలుకూరు మండలంలోని బేతవోలు, పోలేనిగూడెం మీదుగా మునగాల మండలం బరాఖత్‌గూడెం వద్ద విజయవాడ–హైదరాబాద్ హైవేను డబుల్ రోడ్డు కలుపుతుంది. ఈ డబుల్ రోడ్డు పక్కనే సీతారాంతండా ఉంటుంది. ఇంత సౌకర్యం ఉన్నా ఈ తండావాసులు గ్రామ పంచాయతీకి వెళ్లాలంటే కనీసం 10 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. తండా నుంచి బేతవోలుకు సుమారుగా 5 కిలోమీటర్లు, బేతవోలు నుంచి కొమ్ముబండతండాకు 2 కిలోమీటర్లు, అక్కడి నుంచి జెర్రిపోతులగూడెం గ్రామ పంచాయతీకి మరో 2 కిలోమీటర్లు మొత్తం 10 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది.

అనారోగ్యం పాలైతే అక్కడికే..

అయితే గ్రామంలో మొత్తం 400 మంది జనాభా ఉన్నారు. 160 మంది ఓటర్లు ఉన్నారు. అయినా గ్రామంలో రేషన్ దుకాణం లేదు. ఉన్న ప్రాథమిక పాఠశాల మూత పడింది. శ్మశాన వాటిక లేదు. చెత్త డంపిగ్ యార్డు, నర్సరీ లేదు. తండావాసులు పెన్షన్ తీసుకోవాలన్నా గ్రామ పంచాయతీకి వెళ్లాల్సిందే. ఆరోగ్య సమస్యలు వస్తే ప్రాథమిక చికిత్స చేయించుకోవాలన్నా, విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా, రేషన్ బియ్యం కోసం ఇలా అన్నింటికీ 10 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిందే. ఏదైనా పని ఉంటే కూలి వదులుకొని గ్రామ పంచాయతీకి వెళ్లాల్సి వస్తోందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భగీరథ నీటి సరఫరాపై నిర్లక్ష్యం

అయితే ఈ గ్రామానికి మిషన్ భగీరథ నీరు కోదాడ నియోజకవర్గ పరిధి నుంచి కాకుండా మిర్యాలగూడ దగ్గర గల అవంతీపురం నుంచి వస్తాయి. దీంతో ఈ శాఖకు సంబంధించిన వ్యవహారాలు కూడా వారే చూసుకుంటారని అంటూ మండలంలోని మిషన్ భగీరథ ఏఈ, డీఈలు గ్రామంలో నీటి సమస్యను పట్టించుకోవడం లేదని తండావాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఎన్నికల సమయంలోనే దర్శనమిస్తున్నారని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా మార్చాలని లేదా బేతవోలు గ్రామ పంచాయతీ పరిధిలోని మార్చాలని తండావాసులు కోరుతున్నారు.

బేతవోలు జీపీలో కలపాలి



మా తండా నుంచి జెర్రిపోతులగూడెం గ్రామ పంచాయతీకి వెళ్లాలంటే 10 కిలోమీటర్లు దూరం ఉంది. అదేవిధంగా గ్రామంలో సౌకర్యాలు లేవు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా తండాను బేతవోలు గ్రామ పంచాయతీలో కలపాలి. ఈ విషయమై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– జెరుపుల శివ, సీతారాంతండా

క్లుప్తంగా

శివాలయం నూతన చైర్మన్‌గా ఏడుకొండలు


ఏడుకొండలు

చిలుకూరు : పాత చిలుకూరులోని శివాలయం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఆ గ్రామానికి చెందిన కైలాసపు ఏడుకొండలు నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా బాలెబోయిన రవి, ప్రధాన కార్యదర్శిగా కడియాల శ్రీను, సహాయ కార్యదర్శులుగా కందుకూరి శ్రీను, బొర్రెడ్డి అచ్యుత్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా కాసాని గురవయ్య, కోషాధికారిగా కట్టెకోల నారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతరపై నేడు సమీక్ష సమావేశం

మేళ్లచెరువు : మార్చి 8 నుంచి 12 వరకు జరిగే మహాశివరాత్రి జాతర సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించబోయే స్వామివారి కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం దేవాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు దేవాలయ ఈఓ కొండారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మహిళ హఠాన్మరణం

మునగాల(కోదాడ): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ గుండెపోటుతో మృతిచెందింది. సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన అప్పారావు తన భార్య కృష్ణకుమారి(59)తో కలిసి మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని కూతురు ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి హాజరయ్యాడు. ఆదివారం రాత్రి దంపతులు ఆర్టీసీ బస్సులో విజయవాడకు బయలుదేరారు. మార్గమధ్యలో సూర్యాపేట దాటిన తర్వాత కృష్ణకుమారికి ఛాతిలో తీవ్ర నొప్పి రావడంతో 108 సిబ్బంది సమాచారం ఇచ్చారు. మునగాల శివారులో ఆమెకు 108 సిబ్బంది సీపీఆర్ చేసి కోదాడ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మునగాల: గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన గుండు కళావతి శనివారం భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లింది. దుండగులు గమనించి ఆమె ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా తెరిచారు. అందులో ఉన్న రూ.20వేలతో పాటు రూ.77వేల విలువ గల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. కాగా, ఆదివారం ఉదయం పరిసర ప్రాంతాల వారు ఫోన్ ద్వారా కళావతికి సమాచారం ఇవ్వడంతో రాత్రి ఇంటికి చేరుకుని పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. సోమవారం మునగాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజిరెడ్డి తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత

మోతె : మండలంలోని నామవరంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన కీసర విజయపాల్‌రెడ్డి సోమవారం క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కీసర విజయపాల్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆనందకిశోర్, ఉపాధ్యాయులు డేవిడ్, సురేష్‌కుమార్, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల ఎంపీడీఓ బదిలీ

నేరేడుచర్ల : నేరేడుచర్ల ఎంపీడీఓగా పనిచేస్తున్న శంకరయ్య బదిలీ అయ్యారు. ఎన్నికల బదిలీలో భాగంగా గత రెండేళ్లుగా పనిచేసిన ఎంపీడీఓ శంకరయ్య యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ అయ్యారు.

తాగునీటి బావి శుభ్రం

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని కూచిపూడిలో ప్రజలకు తాగునీరు అందించే బావి అపరిశుభ్రంగా ఉందని, నీరు కలుషితమైతే వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుందని 'తాగు నీటి బావిని శుభ్రం చేయాలి'అనే శీర్షికతో సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి మంగళవారం పంచాయతీ సిబ్బందితో బావిలో చెత్తచెదారం, నాచును తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. బావిలో చెత్తను తొలగించేందుకు వార్త ప్రచురించిన 'సాక్షి'కి ఈ సందర్భంగా గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..


బావిలో చెత్తచెదారం, నాచును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మాదిగలకు రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి


మఠంపల్లిలో మాట్లాడుతున్న చింతా బాబు

మఠంపల్లి : తెలంగాణలో సుమారు 70 లక్షల జనాభా గల మాదిగలకు రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబు మాదిగ అన్నారు. సోమవారం మఠంపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ జనాభాను పరిగణలోకి తీసుకుని మరొక మంత్రి, రెండు ఎంపీ సీట్లు, ఒక రా జ్యసభ సీటు కేటాయించాలని డిమాండ్‌చేశారు. నాయకులు కాటమయ్య, విజయభాస్కర్, ముక్కంటి, లక్ష్మీనారాయణ, దేవభిక్షం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను అప్పగిస్తే చరిత్రహీనులవుతారు

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్


మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్య

హుజూర్‌నగర్ : కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పగిస్తే పాలకులు చరిత్రహీనులు అవుతారని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేందుకు ఒప్పుకోలేదని, దానికి కొన్ని షరతులు పెట్టామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కేంద్రానికి కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. కృష్ణాజలాల గురించి మేము అడిగితే మేడిగడ్డ అంటూ ఓ ప్రాజెక్టును పట్టుకొని అవినీతి జరిగిందంటూ మాట్లాడుతున్నారని తెలిపారు. పెద్ద ప్రాజెక్టు కడుతున్నప్పుడు టెక్నికల్ ఇష్యూస్ రావడం సర్వసాధారణమని పేర్కొన్నారు. మేడిగడ్డ సందర్శన అంటూ ఈ ప్రాంత రైతులను మోసం చేసే కార్యక్రమం చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఉద్యమ నాయకునిగా కేసీఆర్ కోదాడ నుంచి సాగర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. తాను కూడా అదే స్థాయిలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో మరో నీటి ఉద్యమం ప్రారంభిస్తానని చెప్పారు. మంగళవారం నల్లగొండలో జరిగే సభకు నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంత్రి ఉత్తమ్‌కు శుభాకాంక్షలు : సైదిరెడ్డి

హుజూర్‌నగర్ నుంచి గెలిచి మంత్రి అయిన ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నా అని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఉత్తమ్‌ను కోరారు. అభివృద్ధిని తాము అడ్డుకోమని, అరాచకాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో, క్యాంపులో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఎస్‌డీఎఫ్ నిధులు సద్వినియోగం అయ్యేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, నాయకులు జయబాబు, జక్కుల నాగేశ్వరరావు, జక్కుల వీరయ్య, కడియం వెంకటరెడ్డి, పచ్చిపాల ఉపేందర్, అమర్‌గౌడ్, బసవయ్య, ప్రదీప్, దొడ్డా నర్సింహారావు పాల్గొన్నారు.

కోదాడలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం


కోదాడలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడ : కృష్ణా జలాలపై చీకటి ఒప్పందం చేసుకొని తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన కేసీఆర్ నల్లగొండలో సభ పెట్టడం ఆయన అవివేకానికి నిదర్శనమని పలువురు కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. సోమవారం కోదాడలోని రంగా థియేటర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ బండారాన్ని శాసనసభలో బయట పెట్టడంతో ప్రజల దృష్టి మరల్చడానికి కేసీఆర్ దొంగ ధర్నాలు చేస్తున్నాడని వారు ఆరోపించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు అశోక్, నియోజకవర్గ అధ్యక్షుడు మాతంగి బసవయ్య, పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వంగవేటి రామారావు, ముత్తినేని కోటేశ్వరరావు, బాజాన్, ముస్తాఫా, కాసర్ల శ్రీనివాసరావు, డేగ శ్రీధర్, రజనీకాంత్, ఉపేందర్, జిల్లేపల్లి గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి


వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోదాడ : సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో పందిరి ఫండేషన్ సభ్యులు ముందుండాలని ప్రముఖ వైద్యులు జాస్తీ సుబ్బారావు, ఏటూకూరి రామారావు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు ఫౌండేషన్ తరఫున కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, చల్లా కొండల్‌రెడ్డి, ఫౌండేషన్ కార్యదర్శి ఇమ్మడి సతీష్, గౌరవ సలహాదారు ఎస్.ఎస్.రావు, వైద్యులు కళ్యాణి అంబరీష్, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన జాతికి అండగా కాంగ్రెస్


రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గిరిజన నాయకులు

పాలకవీడు : గిరిజన జాతికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికి సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించడమే నిదర్శనమని గిరిజన శక్తి రాష్ట్ర కార్యదర్శి కెళావత్ మధునాయక్ అన్నారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంపై హర్షిస్తూ సోమవారం పాలకవీడు మండలంలోని కల్మెట్‌తండాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు మోతీలాల్‌నాయక్, నాగరాజు నాయక్, దేవిలాల్‌నాయక్, వీరన్ననాయక్, దీప్లా నాయక్, పాచ్యానాయక్, సాంబయ్య, రాగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం దేవుడిచ్చిన వరం


సన్మానం పొందిన మాజీ సర్పంచ్‌లతో ఎంపీపీ జ్యోతి

నడిగూడెం : ప్రజలకు సేవ చేయడం దేవుడు ఇచ్చిన వరం అని ఎంపీపీ యాతాకుల జ్యోతి అన్నారు. ఇటీవల పదవీకాలం ముగిసిన పలువురు సర్పంచ్‌లను సోమవారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పాలడుగు ప్రసాద్, ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, గార్లపాటి శ్రీనివాసరెడ్డి, పగడాల ప్రభాకర్‌రెడ్డి, దేవబత్తిని రమేష్ ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ


అంజిరెడ్డి, ఎస్ఐ

మునగాల : మునగాల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బైరెడ్డి అంజిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట వీఆర్ నుంచి బదిలీపై ఆయన మునగాల రాగా ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న పి.లోకేష్ సూర్యాపేట టౌన్‌కు బదిలీ అయ్యారు.

కోదాడ రూరల్ ఎస్ఐగా అనిల్‌రెడ్డి


అనిల్‌రెడ్డి, ఎస్ఐ

కోదాడరూరల్ : కోదాడ రూరల్ ఎస్ఐగా ఎం.అనిల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతగిరి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన కోదాడ రూరల్‌కు రాగా ఇక్కడ పనిచేసిన సాయిప్రశాంత్ సూర్యాపేట సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

గరిడేపల్లి ఎస్ఐగా సైదులు


సైదులు, ఎస్ఐ

గరిడేపల్లి : గరిడేపల్లి నూతన ఎస్ఐగా సైదులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన పోసిరెడ్డి వెంకట్‌రెడ్డి నాగారం పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా సూర్యాపేట సీసీఎస్‌లో పనిచేస్తున్న సైదులు గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.

నడిగూడెం ఎస్ఐగా అజయ్‌కుమార్


అజయ్‌కుమార్

నడిగూడెం : నడిగూడెం మండల నూతన ఎస్ఐగా జి.అజయ్‌కుమార్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఏడుకొండలు తుంగతుర్తికి బదిలీ కాగా నల్గొండ స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న అజయ్‌కుమార్ బదిలీపై నడిగూడెంకు వచ్చారు.

చిలుకూరు ఎస్ఐగా రాంబాబుగౌడ్


రాంబాబు, ఎస్ఐ

చిలుకూరు : చిలుకూరు మండల నూతన ఎస్ఐగా రాంబాబుగౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోదాడ ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసిన ఆయన చిలుకూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

ఒకేసారి ముగ్గురు అధికారుల బదిలీ

చిలుకూరు మండలంలో ఒకేసారి ముగ్గురు అధికారులు బదిలీ అయ్యారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఈదయ్య, ఎస్ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ ఒకేసారి బదిలీ అయ్యారు. కొత్త ఎస్ఐ వచ్చారు. కానీ నూతన తహసీల్దార్, ఎంపీడీఓలు రాలేదు.

పాలకవీడు ఎస్ఐగా లక్ష్మీనర్సయ్య


లక్ష్మీనర్సయ్య

పాలకవీడు : పాలకవీడు పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా కె.లక్ష్మీనర్సయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ లింగం సీసీఎస్‌కు బదిలీ కాగా నల్ల గొండ జిల్లా క్రైం రికార్డ్ బ్యూరోగా పనిచేస్తున్న లక్ష్మీనర్సయ్య బదిలీపై వచ్చారు.

నేరేడుచర్ల ఎస్ఐగా ఎ.రవీందర్‌నాయక్


రవీందర్, ఎస్ఐ

నేరేడుచర్ల : నేరేడుచర్ల ఎస్ఐగా ఎ.రవీందర్‌నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పచ్చిపాల పరమేష్ మేళ్లచెరువు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. సూర్యాపేట వీఆర్‌లో ఉన్న ఎస్ఐ ఎ.రవీందర్‌నాయక్ బదిలీపై నేరేడుచర్లకు వచ్చారు. కాగా, నూతన ఎస్ఐ రవీందర్‌ను పలువురు గిరిజన సంఘాల నాయకులు వినోద్, మల్సూర్, కిరణ్, అనిల్, ప్రసాద్, సుందర్ శాలువాలతో సత్కరించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


మోతె : అన్నారిగూడెంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సంతోష్‌రెడ్డి

మోతె : మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి విడుదలైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేదరమెట్ల వెంకటనారాయణ, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వరరావు, సీత శ్రీను, రెడ్డిమళ్ల సత్యం, ఏటూరి సత్యనారాయణ, రవి, అంజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తండాలు అభివృద్ధి

పాలకవీడు : కాంగ్రెస్‌తోనే గిరిజన తండాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. సోమవారం పాలకవీడు మండలంలోని మిగడంపహాడ్‌తండా గ్రామంలో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.25 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి శ్రీనివాస్, నాయకులు బెల్లంకొండ నరసింహారావు, సైదా, లక్ష్మ, చంద్రు, దస్రు, సైదా, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కోదాడరూరల్ : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ మండలపు కృష్ణకుమారీశేషు అన్నారు. సోమవారం కోదాడ మండలంలోని కాపుగల్లులో ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, రేపూరి వెంకటాచారి, కార్యదర్శి వెంకటనారాయణ, రామారావు ఉన్నారు.

నూతన సాంకేతిక పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఉద్ధంసింగ్ గౌతం

గరిడేపల్లి: రైతులు వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు పాటించాలని ఐసీఏఆర్ న్యూఢిల్లీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్(అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్) ఉద్దంసింగ్ గౌతం అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పురుగు మందు అవశేషాలు లేని ఉత్పత్తులను పండించడానికి, సాగు ఖర్చులను తగ్గించడానికి రైతులు కృషి చేయాలన్నారు. వ్యవసాయాన్ని ఒక వ్యాపారంగా చూడాలని రైతులకు సూచించారు. రైతులు వాతావరణ మార్పులను తట్టుకునే పంటలను పండించాలని అన్నారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి. నరేష్, ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా, సీనియర్ శాస్త్రవేత్త జీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీకి చెందిన స్థలం ఆక్రమణను అడ్డుకోవాలని, సదరు స్థలానికి సంబంధించిన పహాణిని రద్దు చేయాలని శ్రీకనకదుర్గా యూత్ సభ్యులు కోరారు. ఈ విషయమై సోమవారం యూత్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంకకు గ్రీవెన్స్ డేలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూర్‌నగర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పటి నుంచి పీర్ల కొట్టం బజారులో మున్సిపాలిటీ స్థలం 13, 20లో ప్రభుత్వం నిర్మించిన తాగునీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరిన కారణంగా కూల్చివేశారని తెలిపారు. ఖాళీగా ఉన్న ఈ స్థలంపై కన్నేసిన కొందరు అప్పటి తహసీల్దార్‌ను తప్పుదోవ పట్టించి అక్రమంగా పహాణి పొందారని, సదరు స్థలం వ్యవసాయ భూమి కాదని వారు తెలిపారు. అధికారులు పరిశీలించి పహాణిని రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో పీర్ల కొట్టం బజార్ శ్రీకనకదుర్గా యూత్ సభ్యులు కారింగుల వెంకటేశ్వర్లు, ఆకుల రాము, పుట్ట గోవిందు, బత్తిని వీర ప్రసాద్, ఇందిరాల రాంబాబు, రాగి రాజశేఖర్, కోటేశ్వరరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై వినతి

జిల్లాలో దివ్యాంగులు సదరం స్లాట్ల నమోదులో పడుతున్న ఇబ్బందులపై అదనపు కలెక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేసినట్లు సామాజిక కార్యకర్త మన్సూర్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం


ఎంపీడీఓను సన్మానిస్తున్న ఎంపీపీ, సిబ్బంది

మునగాల : మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న పి.లోకేష్‌ను సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు డి.సీతారామరాజు, ఉపాధ్యాయులు జాఫర్, విద్యా భవాని, ఫాతిమాబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

మునగాల : మునగాల ఎంపీడీఓగా సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించిన బి.వెంకటేశ్వర్లు బదిలీపై ఖమ్మం జిల్లా వెళుతుండగా సోమవారం కార్యాలయంలో ఎంపీపీ ఎలక బిందు ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

అనంతగిరి : అనంతగిరి నుంచి బదిలీపై కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న ఎస్ఐ ఎం.అనిల్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు సోమవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి .బుర్ర పుల్లారెడ్డి, నర్సింహారెడ్డి, బాబునాయక్ తదితరులు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన తెలుపుతున్న గురుకుల సిబ్బంది

మేళ్లచెరువు : బదిలీలు, పదోన్నతుల తర్వాతనే నూతన నియామకాలు చేపట్టాలని మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో సోమవారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ మురళీ, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన మహబూబ్ అలీ ద్విచక్రవాహనంపై కోదాడ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో మునగాల వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య మున్నీ మునగాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది.